ప్రజాశక్తి

సోమవారం 22 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంగన్‌వాడీలపై నిర్బంధం

అనకాపల్లి బైపాస్ రోడ్డులో అంగన్‌వాడీలను అడ్డుకున్న పోలీసులు

- సమస్యలను చెప్పుకునేందుకు విజయవాడ వెళ్లనివ్వని పోలీసులు
- ఎక్కడికక్కడ అడ్డగింత
- ప్రభుత్వ తీరును ఖండించిన సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విలేకరులు

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం విజయవాడ బయల్దేరిన అంగన్‌వాడీలను ప్రభుత్వం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఎక్కడికక్కడ అడ్డుకుంది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, రహదారుల్లో పోలీసులు కాపలాకాసి వెళ్లనీయకుండా చేశారు. అనకాపల్లి, తుని రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కకుండా వెనక్కు పంపించారు. అనకాపల్లి కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కనీయలేదు. పార్వతీపురం నుంచి బస్సులో వెళ్తున్న వారిని నక్కపల్లి సమీపంలో అడ్డుకున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండల సిఐటియు నాయకులు సోమునాయుడు, దేముడునాయుడులను, రావికమతం మండలంలో ప్రజా సంఘాల నాయకురాలు సత్యవతిని గృహనిర్బంధం చేశారు.

ఇంకా అనేక చోట్ల సిఐటియు నాయకుల కోసం పోలీసులు గాలించారు. విజయవాడ కార్యక్రమానికి అనుమతు ల్లేనందున వెళ్లే ఆలోచన విరమించుకోవాలని అనకాపల్లి ఎస్‌పి కెవి మురళీకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజును, అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్‌ను గృహ నిర్బంధం చేశారు.

అనకాపల్లి : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో 17 మందిని, బైపాస్ రోడ్‌లో వెళ్తున్న సుమారు 40 మందిని పోలీసులు అడ్డగించారు. ఈ నేపథ్యంలో పోలీసులతో అంగన్వాడీలు వాగ్వాదానికి దిగారు.

అచ్యుతాపురం: సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడును ఆదివారం తన స్వగ్రామమైన భోగాపురంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా నిలిచిన విషయం తెలిసిందే.

పద్మనాభం: చలో విజయవాడకు పలు గ్రామాల నుంచి ప్రయివేటు బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పరిధిలో ఉన్న కొర్రపల్లి గ్రామం వద్ద ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. 32 మంది అంగన్‌వాడీలు బస్సులో మిగతా 2లో..

కొణతాలకు ఎంపీ సీటు

- ఆ భరోసాతోనే జనసేనలో చేరిక
- 'పొత్తు' లెక్కలతో అయోమయంలో టిడిపి ఆశావహులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

దాదాపు పదేళ్లపాటు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగావున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించి పున:ప్రవేశం చేశారు. కొద్ది రోజుల క్రితం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కొణతాల కలిసినప్పుడే ఆ పార్టీలో చేరతారన్న ప్రచారం బలంగా జరిగింది. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేసినా అనకాపల్లి పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అభిమానుల ఆత్మీయ సమావేశంలో త్వరలో అభిమానులతో కలిసి జనసేనలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించడంతో ఊహలకు తెరపడింది. ఆయనకు ఆ పార్టీ ఎంపీ సీటు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

ఏ పార్టీలో చేరాలన్న నిర్ణయంపై చాలా కాలంపాటు కొణతాల ఊగిసలాడారు. చివరకు తనకు ఒక గుర్తింపు, రాజకీయ భవిష్యత్తు వుంటుందని జనసేన పార్టీని ఎంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం నూతన సంవత్సరం, సంక్రాంతి పండగ అభినందనలు తెలుపుతూ వైసిపి ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై మీడియాతో మాట్లాడి ఎన్నికలకు ముందు తాను రాజకీయాల్లోకి వస్తానన్న సంకేతాలను ఆయన పరోక్షంగా ఇచ్చారు. ఈ క్రమంలోనే తొలుత టిడిపిలో చేరతారని ఆయన అనుచరులు ప్రచారం చేశారు. అయితే కాంగ్రెస్‌లోకి వెళ్లాలని కొణతాల అనుకున్నారు.

మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

ఏ పార్టీలో చేరుతానన్నది కొణతాల ప్రకటించేలోపు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తన తనయులతో కలిసి వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. దీంతో సందిగ్ధంలో పడ్డ కొణతాల కొంత వ్యవధి తీసుకొని తన రాజకీయ భవిష్యత్‌పై అంచనా వేసుకొని పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈ క్రమంలోనే జనసేనలో చేరుతున్నట్లు అభిమానుల మధ్య ప్రకటించారు. రాజకీయంగా ఒక పార్టీలో ఇమడలేని కొణతాల, దాడి వేర్వేరు పార్టీల్లో చేరి తమ పట్టు నిలుపుకొనేందుకు మిగతా 2లో..

భారీగా నగదు పట్టివేత

వార్త మెయిన్‌లో..

విశిష్టమైనది భారత రాజ్యాంగం

వార్త మెయిన్‌లో..

ఎన్‌పిఆర్ భవన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

అనకాపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న లోకనాథం

మహనీయుడు లెనిన్

శత వర్ధంతి సభల్లో వక్తలు

వార్తలు 8లో..

హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

Sri PRAVIN KUMAR IAS
Vice Chairman & Managing Director, APIIC Ltd.

గా॥ శ్రీ గుడివాడ అమర్‌నాథ్ గారు
పరిశ్రమలు, మౌళిక వసతులు, ఐ.టి. శాఖామాత్యులు

తాతకు తగ్గ మనుమడుగా...
తండ్రికి తగ్గ తనయుడుగా...
ప్రజల మన్ననలు అందుకుంటున్న
మూడువ తరం నాయకుడు
నిరంతరం ప్రజాభివృద్ధికి కృషిచేస్తూ...
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగాన్ని
అభివృద్ధిపథంలో నడిపిస్తున్న
గా॥ శ్రీ గుడివాడ అమర్‌నాథ్ గార్కి
జన్మదిన శుభాకాంక్షలు.

K. SATYANARAYANA REDDY (RAGHU)
CHAIRMAN: APIIC-IALA, AUTONAGAR & M/s ADI ENTERPRISES

KOLLI ESWAR RAO VICE CHAIRMAN: APIIC-IALA & M/s. SRI BHAVANI WIRE INDUSTRIES KOLLI NARESH KUMAR	CHEEKATI SATYANARAYANA (CSN) SECRETARY: APIIC-IALA & M/s. SRI SAI RAM INDUSTRIES	GUDURI RAMA KRISHNAM RAJU JOINT SECRETARY: APIIC-IALA & M/s. PEGASUS GRANITES LLP
Smt. P. PADMAVATHI TREASURER: APIIC-IALA & M/s. PRIMULA FLEXOPACK PVT. LTD.	R. RAJANIKANTH IALA, CHAIRMAN, AKP LOHMAN CASTINGS- KOTHUR INDUSTRIAL ESTATE	R. SRI KRISHNA DIRECTOR, LOHMAN CASTINGS (P) LTD. NICROME ALLOY CASTINGS (P) LTD
BHAWARLAL VISHNOI DEVYA CHEMICAL CORPORATION AUTONAGAR VISAKHAPATNAM	RAMAKRISHNA NARAPPAREDDY FOUNDER PRESIDENT, VASSIWA, PRATAP INDUSTRIES, AUTONAGAR	CVS PRASAD & C. RAMAKANTH D-BLOCK IALA MEMBER, SVS GROUP OF INDUSTRIES
A.K. BALAJI NATIONAL WORKING COMMITTEE MEMBER, LAGHU UDYOG BHARATI	L. BAPIRAJU LAKSHMI NARASIMHA ALLUMINIUM ROLLING MILLS	J. RAMBABU & J. SRINIVAS SRI MAHA LAKSHMI ENGG. & FABRICATIONS

SUMAN PRAKASH SARAOJI & SOURAB
S.P. BAILING PRESS, D-BLOCK, AUTONAGAR.

D.SRINIVAS, SRI KANYA IRON & STEEL PVT LTD
E-BLOCK, AUTONAGAR

మొదటి పేజీ తరువాయి..

నిర్బంధించిన చోట నిరసన తెలుపుతున్న పెందుర్తి జోన్ పరిధి అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై నిర్బంధం

ఉన్నారు.

తగరపువలస : పద్మనాభం మండలం నుంచి రాత్రి 9.30 గంటల సమయంలో బలవంతంగా అంగన్‌వాడీలను చిట్టివలసకు తరలించారు. అక్కడున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస కళ్యాణ మండపంలో ఉంచారు.

పెందుర్తి : 40 మంది అంగన్‌వాడీలను స్థానిక పోలీసులు నిర్బంధించారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

ఎంవిపి.కాలనీ : పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వారిని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అరకు, విజయనగరం జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను పెట్టారు.

కొనసాగిన సమ్మె

అనకాపల్లి : అంగన్వాడీల సమస్యలపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ జంక్షన్‌లో అంగన్వాడీల నిరవధిక సమ్మె 41 రోజుకు చేరింది. యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో అంగన్వాడీవర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

చోడవరం : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మండలంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు దీక్ష శిబిరంలో పాల్గొని తమ డిమాండ్స్ నెరవేర్చాలని నినాదాలు చేశారు. అంగన్వాడీలతోపాటు ఎస్‌వి నాయుడు పాల్గొన్నారు.

పరవాడ:: పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరవధిక సమ్మె 41వ రోజుకు చేరిన సందర్భంగా ప్రభుత్వానికి నిరసన తెలిపారు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ , ఎం రమణి, సిహెచ్ దేవి, జి అమ్మాజీ, నీలిమ, పార్వతి, సుజాత, కుమారి, రత్నమాల, నాగమణి పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్: అంగన్వాడీలన్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని విజయవాడకు వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకోవడం, నిర్బంధించడం ప్రభుత్వానికి తగదని నర్సీపట్నం సిపిఎం నాయకులు హెచ్చరించారు. ఆదివారం నర్సీపట్నంలో సిపిఎం నాయకులు మీడియాతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా నుండి మద్దతు ఇవ్వడానికి వెళ్లిన అంగన్వాడీ వర్కర్లను ఎక్కడికక్కడ అడ్డుకొని నిర్బంధించడం సరైన పద్ధతి కాదన్నారు. వారి సమస్యలను పరిష్కరిస్తే ఎక్కడికి వెళ్లరని తెలిపారు. పోరాటాలను నిర్బంధించడం అడ్డుకోవడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తీరు దారుణం : లోకనాథం, జగ్గునాయుడు, కుమార్, కోటేశ్వరరావు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించడాన్ని సిపిఎం అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, సిఐటియు ఆయా జిల్లాల ప్రధాన కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. 41 రోజుల నుంచి అంగన్‌వాడీలు వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నారని, అయినా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వారి జీతాలు పెంచకుండా నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి వాటిని విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అందజేయాలని వెళ్తుంటే ఎక్కడికక్కడ పోలీసు బలగాలతో అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

కొణతాలకు ఎంపీ సీటు

ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించారు.

జనసేన చేరికలో వ్యక్తిగత అజెండా లేదని, ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆ పార్టీలో చేరుతున్నానని కొణతాల చెబుతున్నా, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఇస్తామన్న భరోసాతోనే జనసేనలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. టిడిపి, జనసేన పొత్తులో అనకాపల్లి ఎంపీ స్థానం జనసేనకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అనకాపల్లి ఎంపీగా తన తనయుడు విజయ్‌ను బరిలోకి దించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు ప్రయత్నం చేస్తున్నారు.

మరోవైపు బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ఆశ పడుతున్నారు. దాడి వీరభద్రరావు తన తనయుడు రత్నాకర్‌కు ఎంపీ సీటు కోసం ప్రయత్నం చేస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. టిడిపి అధినేత చంద్రబాబు వ్యూహాత్మకంగా పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటును జనసేనకు కేటాయించి, ఈ తలనొప్పుల నుంచి బయటపడాలన్న ఆలోచనలో వున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పవన్ నుంచి ఆ హామీతోనే కొణతాల జనసేనలో చేరాలన్న నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం వుంది.

వైసిపి ఇంటికి వెళ్తేనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్తేనే తప్ప రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడదని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేయడానికే వైసిపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. జగన్ తాడేపల్లికి పరిమితమై రాష్ట్ర పరిపాలన గాలికి వదిలేశారన్నారు. ప్రజలను జగన్ మభ్యపెట్టి మరలా అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాస్తూ దళితులపై దాడులు చేసి సిగ్గులేకుండా జగన్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించారని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించారని, మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి విశాఖలో భూకబ్జాలు, దోపిడీలు పెరిగి పోయాయని ఆరోపించారు. రామానాయుడు స్టూడియోను కొట్టేయాలని వైసిపి నాయకులు చూసారని, ఎమ్మెల్యే వెలగపూడి సుప్రీంకోర్టులో కేసు వేయడంతో కోర్టు వైసిపికి మొట్టికాయలు వేసిందని తెలిపారు.

మాట్లాడుతున్న పల్లా శ్రీనివాస్

తల్లిదండ్రుల చెంతకు సోను

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో, మానసిక స్థితి దెబ్బతిని, కుటుంబ సభ్యులు ఎవరికీ చెప్పకుండా ఈ నెల 19న రైలులో జార్ఖండ్ రాష్ట్రం రాంచీకి చెందిన అవినాష్ కుమార్ సోను విశాఖకు రాగా ఆయన్ని తల్లిదండ్రుల చెంతకు ఎయుటిడి నిర్వాహకులు, పోలీసులు చేర్చారు. తొలుత రాంచీలోని సోను బంధువులు అక్కడి రైల్వే పోలీసులకు సోను కనిపించని సమాచారం అందించారు. అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖపట్నంలో ఆర్‌పిఎఫ్ సిబ్బంది అవినాష్ కుమార్ సోనును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎయుటిడి వారికి సమాచారం ఇవ్వడంతో వారు ఆయనను జివిఎంసి హోం లెస్ షెల్టర్‌కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన పరిస్థితి మెరుగుపడటంతో అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు మనోజ్ సోను, సరోజినీ దేవి ఆదివారం ఇక్కడకు వచ్చి ఎయుటిడిలో ఉన్న కుమారుడిని కలిశారు. ఎయుటిడి వారికి వారు ధన్యవాదాలు తెలిపారు.

ఎయు మెస్ తెరిపించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సంక్రాంతి సెలవులు అనంతరం యూనివర్సిటీ తరగతులు ప్రారంభమై నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ నేటి వరకు యూనివర్సిటీ మెస్ ప్రారంభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ అధ్యక్షులు డి.వెంకటరమణ, కార్యదర్శి పి.సూర్య ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి మెస్ ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. మెస్ బిల్లు కడితే గానీ మెస్‌లు ఓపెన్ చేయబోమని హాస్టల్ అధికారులు చెప్పడం దుర్మార్గం అన్నారు. మెస్ బిల్లులు రిలీజ్ చేయడంలో సమస్య ఉందన్నారు. నెల మొత్తం వచ్చిన విద్యార్థికి, నెలలో 15 రోజులు వచ్చిన విద్యార్థికి ఒకే కొలమానంతో బిల్లులు రిలీజ్ చేశారన్నారు. తక్షణమే ఆడిట్ జరిపి మళ్ళీ మెస్స్ బిల్లులు రిలీజ్ చేయాలన్నారు. సోమవారం నుంచి మెస్ తెరవకపోతే విద్యార్థులతో రిజిస్ట్రార్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రగతి పథాన ఎన్ఎస్ఇ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ప్రపంచంలోనే అతిపెద్ద మూడో డెరివేటివ్ ఎక్స్‌చేంజ్‌గా నేషనల్ స్టాక్ ఎక్స్‌చేంజ్ (ఎన్ఎస్ఇ) ముగిసిన 2023వ సంవత్సరానికిగానూ ఈక్విటీ సెగ్మెంట్‌లో గుర్తింపు సాధించిందని ఆ సంస్థ బిజినెస్ డవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ వెల్లడించారు. విశాఖలోని ఓ కార్యక్రమంలో ఆ వివరాలను ఆయన వెల్లడించారు. 2023లో ట్రేడ్‌ల సంఖ్య అంటే ఎలక్ట్రానిక్ ఆర్డర్ బుక్స్ ప్రకారం ఈక్విటీ విభాగంలో ప్రపంచంలోనే మన దేశంలోని ఎన్ఎస్ఇ మూడో స్థానం సాధించిందని, ఈ విషయాన్ని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్‌చేంజ్ (డబ్ల్యుఎఫ్ఇ) ప్రకటించినట్లు తెలిపారు. లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ (యుఎస్‌డి) 4 ట్రిలియన్లను అధిగమించి ఎన్ఎంఇ లిస్టెడ్ కంపెనీలు రూ.లక్ష కోట్లు మార్కును దాటి, నిఫ్టీ 50 ఇండెక్స్ మొదటిసారిగా 20 వేల ఇండెక్స్ అధిగమించి అనేక మైలురాళ్లను దాటిందన్నారు. 2024లో ప్రత్యేకంగా ఎన్ఎస్ఇలో 8.5 కోట్ల మంది పెట్టుబడిదారుల సంఖ్యను చేరిందన్నారు. ఈ ఏడాదే కొత్తగా లాభాపేక్ష లేని సంస్థలు (ఎన్‌పిఒ)లు 42 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయని ప్రకటించారు.

ఆట, పాటలతో ఆత్మీయ సందడి

ప్రజాశక్తి-ఉక్కునగరం : తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం 'ఆత్మీయ సందడి' నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు, ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్. కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆట, పాటలతో తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం కుటుంబ సభ్యులు అలరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, ఏటా తమ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆత్మీయ సందడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన తమ ఉద్యోగులు ఐక్యతను చాటాలన్నారు. ఈ వేడుకలలో భాగంగా తెలంగాణ ఉద్యోగుల కుటుంబాలు పలు సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు, జి.మల్లేశం, జె.శ్రవణ్‌కుమార్, టి.ప్రభాకర్, ఎం.గోపాల్, ఎస్.బలరాం, టి.కనకరాజు పాల్గొన్నారు. ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 - 2026 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చీఫ్ అడ్వైజర్‌గా ఎన్.వీరేశం, గౌరవాధ్యక్షులుగా ఎంకెవిఆర్.మోహనరావు, అధ్యక్షునిగా ఎన్.కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జి.ఆనంద్ ఎన్నికయ్యారు.

25 నుంచి ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 28 వరకు శ్రీచెస్ అకాడమీ రెండో ఫిడే రేటింగ్‌గల ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, టోర్నమెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.బాబూరావు మీడియాతో మాట్లాడుతూ నాలుగు లక్షల రూపాయల నగదు బహుమతి విజేతలకు బహూకరిస్తామని తెలిపారు. విశాఖపట్నం ఎంవిపి.కాలనీ ఎస్ - 3 ఏరీనాలో నిర్వహించే ఈ పోటీల్లో వయస్సుతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 23లోపు 9989971232 / 9849371760 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

స్కూబా డైవర్ల సామాజిక సేవ ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఎకో-వైజాగ్ కార్యక్రమాల నేపథ్యంలో ఎకో-క్లీన్, ఎకో-బ్లూ, ఎకో-జీరో ప్లాస్టిక్ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం రుషికొండ సముద్ర ప్రాంతంలో ప్లాటిపస్ ఆర్గనైజేషన్ స్కూబా డైవర్లు సముద్రంలో వ్యర్ధాలను వెలికి తీసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వారు విశాఖ నగరానికి సహకరించడం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జివిఎంసి కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి పిఠాపురం వారి కోర్టు నందు
H.M.O.P. 110/2023

బిట్వీన్:
యాళ్ళ చాందీషా ...పిటీషనర్
అండ్
యాళ్ళ కులభూషణం ...రెస్పాండెంట్

నోటీసు

To
రెస్పాండెంట్:
యాళ్ళ కులభూషణం, S/o. సుందరరావు, సి. హెచ్. నాగాపురం గ్రామం, గొలుగొండ మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్ గారు మీపై విడాకుల కొరకు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు మీకు కోర్టు ద్వారా పంపిన నోటీసులు మీరు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్ లో మీ హాజరు కొరకు తేది.01-02-2024న వాయిదా అయివున్నది. ఆదినమున మీరు ఉ॥ గం॥10.30ని॥ లకు స్వయంగాగానీ, వకీలు ద్వారాగానీ పై తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పైపిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టువారు మీపరోక్షమందు తీర్మానించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

YADALA GOVINDA RAJU
Advocate
Court Street, Tuni-533401
Kakinada Dist. Cell: 98486 61409

పరిహారానికి అన్నదాత ఎదురుచూపు

- మిచౌంగ్ తుపాను ముంచేసినా కరుణ చూపని ప్రభుత్వం
- పరామర్శలు తప్పితే.. పరిహారం ఊసే లేదు
- సాదా సీదాగా సంక్రాంతి..

భీమిలి మండలం, టి నగర పాలెంలో నేలకొరిగిన వరి (ఫైల్)

ప్రజాశక్తి -భీమునిపట్నం : దాదాపు నెల రోజుల క్రితం మిచౌంగ్ తుపాను కారణంగా భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో వరి పంట తీవ్రంగా దెబ్బతింది. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలకు వరి పంట నీట మునిగింది. మరి కొంత పంట నేల వాలింది. కళ్లెదుటనే పంట నీట మునిగిపోవడంతో రైతు కన్నీరు పెట్టాడు.

పరామర్శలు తప్పితే.. పరిహారం ఊసే లేదు..

తుపాను తీవ్రతకు పంట దెబ్బతిన్న బాధిత రైతులను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇతర అధికార పార్టీ నాయకులు వరుస పరామర్శలు చేశారు. దెబ్బతిన్న, నీట మునిగిన పంటను నేరుగా పరిశీలించారు. "మీరు అధైర్య పడొద్దు, మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది, తగిన పరిహారం ఇచ్చి ఆదుకుంటుంది" అంటూ బాధిత రైతులకు స్థానిక ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎడతెరిపి లేకుండా తెగ పర్యటనలు చేసి పంట పొలాలను పరిశీలించినప్పటికీ పైసా పరిహారం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పండగంటే పూటా ఎదురు చూపు..

పెద్ద పండుగ సంక్రాంతి ముందు పరిహారం వస్తుందని ఆశగా ఎదురు చూసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం కూడా అందలేదని రైతులు వాపోతున్నారు. తుపాను రాకుంటే పంటలు బాగా పండేవని, సంక్రాంతికి పంట చేతికొచ్చి చేతిలో పైసలు ఆడేవని, ఎవరి సాయం కోసమో ఎదురు చూసే వాళ్లం కాదని భీమిలి మండలం, టి.నగరపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతులు బొల్లంపల్లి సుబ్బారావు, బర్ల అప్పన్న, పల్లా రాము, సన్యాసిరావు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన కనకల వెంకటరమణ ప్రజాశక్తికి తెలిపారు.

అపార నష్టం.. అందని సాయం..

తుపాను కారణంగా భీమిలి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో అపారంగా వరి పంటకు నష్టం వాటిల్లింది. మండలాల వారీగా దెబ్బతిన్న వరి పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి పంట నష్టం అంచనాలను నివేదిక రూపంలో రూపొందించి ప్రభుత్వానికి అందజేశారు. దెబ్బతిన్న ఎకరా వరి పంటకు ప్రభుత్వం పరిహారం కింద రూ.6,400 ప్రకటించింది. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

భీమిలి మండలంలో 9 గ్రామాల్లో 210 మంది రైతులకు చెందిన 186 ఎకరాల వరి పంట దెబ్బతింది. ఇందుకు పరిహారంగా రూ.12 లక్షల 66 వేల 684 గా అధికారులు అంచనాలు వేశారు. ఆనందపురం మండలంలో 11 గ్రామాల్లో 188 మంది రైతులకు చెందిన 103 ఎకరాల వరి పంట దెబ్బతింది. ఇందుకు గాను పరిహారంగా రూ.7 లక్షల ఒక వేయి 403గా అధికారులు అంచనాలు వేశారు. పద్మనాభం మండలంలో 15 గ్రామాల్లో 196 మంది రైతులకు చెందిన 156 ఎకరాల వరి పంట దెబ్బతింది. ఇందుకు గాను పరిహారంగా రూ.10 లక్షల 60 వేల 382గా అధికారులు అంచనాలు వేశారు.

పరిహారం ఇవ్వాలి

ఎకరా వరి పంట సాగుకు సుమారు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పంటపై పెట్టుబడి పెట్టాను. అనుకోకుండా వచ్చిన తుపాను 4 ఎకరాల వరి పంటను ఊడ్చేసింది. దెబ్బతిన్న వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. అయితే ఇప్పటికీ పైసా పరిహారం అందలేదు.

బొల్లంపల్లి సుబ్బారావు
కౌలు రైతు
టి.నగరపాలెం
భీమిలి మండలం

సాదాసీదాగా సంక్రాంతి

సంక్రాంతి పండగను సాదా సీదాగా జరుకుకున్నాం. సాధారణంగా వరి పంట సంక్రాంతి నాటికి చేతికి వస్తుంది. ఏటా ఇంటిల్ల పాది, బంధువుల రాకతో సరదాగా పెద్ద పండుగ జరుపుకునే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏదో సంప్రదాయం కాబట్టి అప్పోసప్పో చేసి పెద్ద పండగ జరుపుకున్నాం. మొన్నటి తుపానుకు రెండున్నర ఎకరాల వరి పంట పూర్తిగా నీట మునిగింది.

కనకల
వెంకటరమణ
రైతు,లక్ష్మీపురం
భీమిలి మండలం

నేరాలు ఘోరాలు

బైకులు ఢీ : యువకుడు మృతి

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో కృష్ణదేవిపేట సమీపంలోని కొయ్యూరు మండలం కొండగోకిరి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గొలుగొండ మండలం కొంకసింగి గ్రామానికి చెందిన రవితేజ (28) ద్విచక్ర వాహనంపై నర్సీపట్నం నుంచి వస్తున్నాడు. అదే సమయంలో కేడీ పేట నుంచి నర్సీపట్నం వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రవితేజ అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన గొలుగొండ గ్రామానికి చెందిన యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - అచ్యుతాపురం : మండలంలోని ఆవ సోమవారం పంచాయితీ స్థానిక కాలువ సమీపంలో ఆదివారం కాకినాడ జిల్లా, జగన్నాథపురం రిక్షాలపేట వీధికి చెందిన కాకి ఉదయకుమార్ (21) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ గ్రామం నుంచి చెల్లిని చొడపల్లి గ్రామంలో అత్తవారింటికి తీసుకువచ్చాడు. ఇంతలో ఇలా ఉరేసుకుని మృత్యువాత పడ్డాడు. ఉదయ్‌కుమార్ మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కెజిబివి విద్యార్థినుల హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ దిగ్విజయంగా లూనార్ ల్యాండర్‌ను చంద్రుని ఉపరితలంపై దించి భారత్ సరసన చేరడంపై హర్షం తెలుపుతూ స్థానిక కెజిబివి విద్యార్థినులు ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల వద్ద నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ప్రిన్సిపల్ గంగాకుమారి మాట్లాడుతూ, జాబిల్లిపై హ్యూమ నౌకను సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన దేశంగా ప్రపంచంలోనే భారత్ నాలుగో స్థానంలో ఉండగా, ప్రస్తుతం జపాన్ ఐదో దేశంగా నిలిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఒ కలిషా బేగం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : స్లిమ్ విజయవంతం కావాలని కోరుతూ మండలంలోని నేలేర్రు కెజిబివి విద్యార్థినులు ప్రదర్శన చేశారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాష్, తదితరులు

బాలికల రక్షణ ప్రభుత్వాల బాధ్యత

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలికల రక్షణ ప్రభుత్వాల ప్రథమ బాధ్యత అని అందుకనుగుణంగా చట్టాలు తెచ్చినా అవి అమలు కావడం లేదని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం చినగదిలి తహశీల్దారు కార్యాలయం వద్ద గల ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సురక్షిత బాల్యం బాలికల హక్కు నినాదంతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఈ నెల 24న దేశవ్యాప్తంగా జాతీయ బాలికల హక్కులు సమాజంలో బాలికలకు ఇస్తున్న స్థానం, ప్రభుత్వం బాలికల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు గురించి చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం పర్యవేక్షణాధికారి ఎవి.సునీత, డాక్టర్ బాబ్జీ, రమాదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ నగరపాలెంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.18 లక్షలతో సిసి రోడ్డు ఏర్పాటుకు సర్పంచ్ బిఆర్‌బి నాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, వైస్ సర్పంచ్ పిల్ల సూరిబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

దళితుల నిరసన

ప్రజాశక్తి- పిఎం పాలెం : విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టడం సహించలేక తెలుగుదేశం పార్టీతో జతకట్టిన పార్టీలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయంటూ జివిఎంసి 6వ వార్డు పరిధి బక్కన్నపాలెం గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఇన్‌ఛార్జి కనకరాజు సియ్యాద్రి మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహం నిర్మాణంలో అడ్డగోలుగా డబ్బులు దోచుకున్నారని చెప్పడం దారుణమన్నారు. జనసేన, టిడిపి జంటగా ఏర్పడబోయే ప్రభుత్వంలో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చేస్తామని, మరలా కొత్త విగ్రహాన్ని నిర్మిస్తామని అనడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. ఆ మాటలు వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత నాయకులు కుడితి రామారావు, నూకవరపు బాబ్జి, బెల్లాన ప్రసాద్, గుంటుబోయిన సంజీవ్, జామి శివ, సింహాద్రి అప్పలరాజు , అప్పారావు, సాంబార్కి కనకరాజు, ఎస్.పైడమ్మ, ఎస్.కొండమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్వర్ణ శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆది వారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహనరావు సుమారు వంద మందికి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీపై టిడిపి నాయకులు ఆదివారం విస్తృతంగా ఇంటింటా ప్రచారం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేయనున్నట్లు పార్టీ బిసి సాధికారత పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వానపల్లి సత్య అన్నారు. ఇందుకు సంబంధించి పార్టీ ముద్రించిన బ్రోచర్లను స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి అందజేశారు. జివిఎంసి రెండో వార్డు పరిధిలో ఆదివారం ప్రచారం చేశారు. టిడిపి ప్రభుత్వం తొలి నుంచీ బిసిల సంక్షేమం కోసం పనిచేస్తోందని గుర్తు చేశారు. టిడిపి తోనే రాష్ట్ర భవిష్యత్తు అని సత్య నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పద్మశాలి సంఘం కమిటీ సభ్యులు బడిగింట మహేష్, జోగ సన్యాసిరావు, గిడుతూరి శ్రీను, జనార్ధనరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో వార్డులో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మందులను అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జిమ్సర్ ఆసుపత్రి, గీతం దంత వైద్య కళాశాల సౌజన్యంతో ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం పెదగదిలి కూడలిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పెదగదిలి, చినగదిలి, ఆరిలోవ, ఆదర్శనగర్, హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకు గల కొండవాలు ప్రాంతాల నుంచి స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ఎడువాక సన్యాసిరావు, గాడి సత్యం, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోవిందు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ పార్లమెంటు టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు, 9వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెదగదిలి అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని గోవిందు పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. టిడిపి నాయకులు, ఎస్‌సి సెల్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, బాలస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేస్తున్న రాంబాబు తదితరులు

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు స్వతంత్రనగర్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సత్తిబాబు మూడు రోజులు క్రితం అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి రామచంద్రనగర్ రిక్షాకాలనీ భవనిర్మాణ కార్మిక సంఘం సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రాంబాబు, డి.రమణ మాట్లాడుతూ, కుటుంబ పెద్ద అయిన సత్తిబాబు మరణం ఆ కుటుంబానికి తీరని లోటు అన్నారు. సంఘం అభివృద్ధి చెందుతూ, చనిపోయిన అందరిని ఆదుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి.లక్ష్మి, రాజారావు, అర్జున్ రావు, కె.త్రినాధరావు, ఎం.త్రినాధ్, రామ్మూర్తి, చిన్న, సింహాచలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగిరెడ్డి

'హౌస్ కమిటీ పరిష్కారం వైసిపిదే'

పజాశక్తి -గాజువాక : గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ నెల 27వ తేదీన భీమిలిలో జరగనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖరావాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజవర్గానికి 10 వేల మందికి తక్కువ లేకుండా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు), మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు, తిప్పల వంశీరెడ్డి, కేబుల్ మూర్తి, రాజాన రామారావు, భూపతి సుజాత, ఇమ్రాన్, గుడివాడ లతీసు, ఇల్లపు ప్రసాదు, పరదేశి, దొడ్డి రమణ, పల్లా చిన్నతల్లి, ధర్మాల శ్రీనివాసరావు, యువశ్రీ, మంజుల పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరాలతో ఐక్యత సాధ్యం

ప్రజాశక్తి -ములగాడ : భారత రాజ్యాంగ లక్ష్యాలైన ఐక్యతను, సమగ్రతను సాధించడానికి జాతీయ సమైక్యత శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన హైదరాబాద్ మేడ్చల్‌లోని మర్రి లక్ష్మణరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్ర రాష్ట్ర కంటింజెంట్ లీడర్‌గా ఆమె పాల్గొని, ఆదివారం నగరానికి చేరుకున్న ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ జాతీయ సమైక్యత శిబిరంలో 12 రాష్ట్రాల నుంచి వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారని, తాను ఆంధ్రప్రదేశ్‌లోని 11 విశ్వవిద్యాలయాల నుండిఎంపికైన మహిళా వాలంటీర్లకు కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు భారత విభిన్న సంస్కృతిని, ఐక్యత ప్రాధాన్యతను తెలియజెప్పాయని వివరించారు. జాతీయ సమైక్యత శిబిరంలో శ్రమదానం, యోగ, ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాలు, మేధావుల ఉపన్యాసాలు, దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు తదితర అంశాలను నిర్వహించారని, వాటిలో ఆంధ్రప్రదేశ్ వాలంటీర్లు చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అనసూయా దేవి క్యాంప్ సర్టిఫికెట్లను వివిధ విశ్వవిద్యాలయాల వాలంటీర్లకు పంపిణీ చేశారు.

భూ యాజమాన్య హక్కుల చట్టంపై ఉధృత పోరాటం

ఉత్తరాంధ్ర అడ్వకేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఉత్తరాంధ్ర న్యాయవాదుల ప్రతినిధులు సూర్యారావు, దామోదర్ రావు తదితరులు

ప్రజాశక్తి-లీగల్ : ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ప్రజా ఆస్తులకు వ్యతిరేకమైన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసే వరకూ ఈ పోరాటం ఆగదని, నిరవధికంగా నడిపిస్తామని ఉత్తరాంధ్ర అడ్వకేట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదివారం విశాఖపట్నంలో న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తీర్మానించారు. విశాఖపట్నం న్యాయవాదుల సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ బెవర సత్యనారాయణ ఆధ్వర్యాన న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, ఈ భూ యాజమాన్య హక్కుల చట్టం ప్రజలకు ఆస్తుల రక్షణలో భద్రత లేకుండా తయారైందన్నారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సూర్యారావు మాట్లాడుతూ, ఈ చట్టం అమలైతే చిన్న సన్న కారు రైతులకు వారి స్థిరాస్తులు హక్కులు కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని, చిన్నచిన్న విస్తీర్ణంలో నిర్మించుకున్న భవనాల యాజమాన్యపు హక్కులకు కూడా భంగం వాటిల్లుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి ఏర్పాటుకు కృషి చేస్తామని విజయనగరం జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దామోదర్‌రావు తెలిపారు. ఏమాత్రం న్యాయ పరిజ్ఞానం లేని ప్రభుత్వ అధికారులు స్థిరాస్తులు హక్కులను ఏ విధంగా నిర్ణయిస్తారని ఆల్ ఇండియా లాయర్ యూనియన్ విశాఖపట్నం ప్రతినిధులు బివి.రామాంజనేయరావు, ఎన్.వెంకటేశ్వరరావు, బగాది తులసీదాస్ ప్రశ్నించారు. 34 రోజులుగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు హాజరైన ప్రతినిధులంతా సంఘీభావం తెలియజేశారు. ఇకనుంచి ఉత్తరాంధ్ర న్యాయవాది సంఘాలన్నీ ఉమ్మడిగా కార్యాచరణను రూపొందించుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆముదాలవలస న్యాయవాదుల సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, చోడవరం బార్ ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి, విశాఖపట్నం స్టీరింగ్ కమిటీ ప్రతినిధులు సాకేటి మోహన్ నాయుడు, యుఎస్ఆర్.రాజు, జెవివి.రాఘవేంద్రరావు, ఎన్‌వి.సుమన్, విశాఖ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కె.రామజోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిబాబు జన్మదిన వేడుకలు

గిరిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కోలా గురువులు, ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు హాజరై గిరిబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తే కార్యకర్తలకు, నాయకులకు మంచి అవకాశాలు కల్పిస్తూ, రాష్ట్రాన్ని పురోభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారని తెలిపారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ, ఉద్యోగులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, నాయకులు సన్యాసినాయుడు, టి.పద్మనాభం, గురునాయుడు, ఈశ్వరరావు, నారాయణరావు, సత్యనారాయణ, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరించాలి

గంగవరంలో పాదయాత్ర చేస్తున్న కోదండరావు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కొవిరి కోదండరావు, కొవిరి దేవుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గంగవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరపున పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సిఎస్ఆర్ నిధులతో గంగవరంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. షర్మిల రాకతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం వస్తాదని ఆశాభావం వ్యక్తంచేశారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, అమ్మోరు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదాన శిబిరంలో బండారు సత్యనారాయణమూర్తి తదితరులు

ప్రజాశక్తి-వేపగుంట : రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంటలో జిపిఆర్ యంగ్ స్టార్స్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 60 మంది రక్తదానం చేశారు. ఈ యూనిట్లను ఎన్‌టిఆర్ ట్రస్ట్‌కు అందించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ ఇటువంటి చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ముఖ్యంగా యువకులు సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంట్ల దివాకర్, గంట్ల శ్రీను, గంట్ల భరత్, దాట్ల మధు, బల్ల రాము, పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి స్వరూప్ భౌతికకాయం

ప్రజాశక్తి-వేపగుంట : పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌కు చెందిన యర్ర స్వరూప్ (30) భౌతికకాయం ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కోల్‌కతాలోని రైల్వే అర్బన్ బ్యాంకు చార్టెడ్ అకౌంటింగ్ విభాగంలో స్వరూప్ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. స్వరూప్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. కృష్ణానగర్ తీసుకొచ్చిన స్వరూప్ భౌతిక కాయం వద్ద పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైసిపి నాయకులు బెహరా భాస్కరరావు, అజయ్, బండి సత్తిబాబు, వినోద్, జిలాని, నర్సింగ్, మహాలక్ష్మినాయుడు, జనసేన నాయకులు పిన్నింటి పార్వతి తదితరులున్నారు.

సామాజిక సేవ గొప్పది

ప్రజాశక్తి -గాజువాక : సమాజానికి మేలు చేకూర్చేలా చేపట్టే సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని సౌత్ ఎసిపి టి.త్రినాధ్ అన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన కొత్త గాజువాక హైస్కూలు రోడ్డులో పేదలకు నిత్యవసర సరుకులు, వస్త్రాలు, దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, వికలాంగులు, రైతులను గుర్తించి ఇతోధికంగా సాయమందించడం గొప్ప విషయమని అన్నారు. అమ్మ పేరుతో ట్రస్టును నెలకొల్పి రాజకీయాలకతీతంగా సేవలు అందిస్తుండడం శుభపరిణామం అన్నారు. ప్రచారం కన్నా ప్రజా సేవే గొప్పదని నమ్మిన ట్రస్టు సభ్యులను అభినందించారు. ట్రస్టు అధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాటా శ్రీనివాస్, డాక్టర్ హేమలత, పల్లా చినతల్లి, యువశ్రీ, అయ్యలనాయుడు, మెడికల్ ఆఫీషర్ సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతర

ప్రజాశక్తి -ములగాడ : నేడు కాకప్పని జాతర వేడుకలు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

ఫార్మా బాధితులపై మరో కుంపటి!

- మరో ఘాతుకానికి తెరలేపుతోన్న 'రాంకీ'?
- 50ఎకరాల్లో ఘన వ్యర్థాల నిల్వ కేంద్రం విస్తరణ
- 30న ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసులు
- తల్లడిల్లుతున్న తాడి, తదితర గ్రామాల బాధితులు



ఘన వ్యర్థాల నిల్వ కేంద్రం విస్తరణకు రాంకీ ఫార్మా ప్రతిపాదిస్తున్న భూమి

ప్రజాశక్తి-పరవాడ: పరవాడ ఫార్మాసిటీ ఆనుకొని ఉన్న తాడి, తానాం గ్రామాలను తరలించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం ఇపుడు నిబంధనలకు విరుద్ధంగా తాడి గ్రామాన్ని అనుకొని ఫార్మా ఘన వ్యర్థాల నిల్వకు 50 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించడంపై బాధిత నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ఫార్మా వ్యర్థాల నిల్వ కేంద్రానికి భూమి కేటాయింపుపై ఈనెల 30న స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసులు జారీపై ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఫార్మా కాలుష్యంలోచిక్కుకుని అల్లాడుతున్న తాడి వాసులకు తాజాగా ఫార్మా వ్యర్థాల నిల్వ కేంద్రం ఏర్పాటుతో నిండా మునిగిపోయినట్టేనని వాపోతున్నారు.

పరవాడ మండలంలోని లేమర్తి అగ్రహారం, ఈదులపాకు బోనంగి, తాడి, తానాం, రెవెన్యూ గ్రామాలలో జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం 2400 ఎకరాలను ఎపిఐఐసి ద్వారా సేకరించి, 102 ఫార్మా కంపెనీలు నెలకొల్పింది. మరో 10 పరిశ్రమల వరకు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఫార్మా పరిశ్రమల డెవలపర్‌గా రాంకీ, విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ వ్యవహరిస్తున్నాయి. అప్పుడు లేమర్తి అగ్రహారం, ఈదులపాక బోనంగి, ఏదురువానిపాలెం, కొత్తపాలెం, పానకాల పేట, దోప్పవానిపాలెం తదితర గ్రామాలను ఖాళీ చేయించి వేరేచోట తరలించారు.అయితే తాడి గ్రామం నేటికీ తరలిచంలేదు.

అయితే డెవలపర్‌గా వ్యవహరిస్తున్న రాంకీ ఫార్మా తన బాధ్యతలు సక్రమంగా నెరవేర్చకపోవడం వలన తాడి, తానం పరవాడ ఇ.బోనింగి లంకెలపాలెం, సాలాపు వాణి పాలెం తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నారు. తాడి పక్కనే ల్యాండ్ ఫిల్ ఘన వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల తాడి గ్రామంలో భూగర్భ జలాలు కాలుష్య కారకమై, ప్రజలు వివిధ వ్యాధులు బారిన పడి ల్లాడుతున్నారు. ఫార్మా కంపెనీల చుట్టూ గ్రామానికి 500 మీటర్ల గ్రీన్ బెల్ట్ ఏర్పాటుకు కేటాయించిన భూమిని కూడా రాంకీ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేసింది. దీనిపై ప్రభుత్వం కానీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గాని చర్యలు తీసుకోలేదనే విమర్శలు గట్టిగానే వినిపిస్తున్నాయి. గ్రీన్ బెల్ట్ లేకపోవడంతో తాడి గ్రామం పరిశ్రమల మధ్య చిక్కుకోగా, ప్రజలు సవాలక్ష అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్నారు.

తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని తాడివాసులు కొన్నేళ్లుగా మొరపెట్టుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాంకీ యాజమాన్యం మరో 50 ఎకరాలకు ల్యాండ్ ఫిల్ విస్తరణ పనులు చేపట్టాలని ప్రతిపాదించి, అది కూడా తాడి గ్రామంలో సర్వే 116లో రూ.200 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు కోరుతూ ఈనెల 30న ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నారు. ఇది ముమ్మాటికి ప్రజల నెత్తిపై మరో కాలుష్య కుంపటేనని ఈ చర్యలను ఆపాలని ప్రజాసంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ రాంకీ చర్యలతో తీవ్రంగా నష్టపోతున్నామని, గాలి, నీరు, నేల పూర్తిగా కాలుష్యానికి కారణం అవుతున్న రాంకీ యాజమాన్యంపై కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానిక ప్రజలు, ఇపుడు కొత్త కుంపటిపై ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తిక్కవానిపాలెం సముద్రంలో శుద్ధిచేయని విష రసాయనాలను విడిచి పెడుతున్నారు. వీటిపై తక్షణ చర్యలతోపాటు ప్రతిపాదిత ఫార్మా వ్యర్థాల నిల్వ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే రాంకీ కాలుష్యంపై సిపిఎం నేతలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని ప్రజలు ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఎలా బతికేది?

ఫార్మా సిటీ రాకముందు పూర్తి ఆరోగ్యంతో ఉండే వారం. ఫార్మా సిటీ వచ్చాక సవాలక్ష రోగాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇపుడు పార్మా వ్యర్థాల నిల్వకు మరో కేంద్రం ఏర్పాటు అన్యాయం.ఎలా బతికేది?

పితాని సన్యాసిరావు, తాడి గ్రామం

మా గ్రామాన్ని తరలించండి

మా గ్రామాన్ని తరలించకుండా, గ్రామాన్ని ఆనుకుని మరో 50 ఎకరాలలో ఫార్మా వ్యర్థాలు నిలువ చేయడంతో మేము జీవించలేము. తక్షణమే మా గ్రామాన్ని తరలించాలి.

నంద లక్ష్మి, తాడి గ్రామం

వ్యాధులతో సతమతం

ఫార్మా వ్యర్థాలు, కాలుష్యంతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.కిడ్నీ సంబంధిత వ్యాధితో కాళ్లు చేతులు వంకర్లతో అనేక మంది అనారోగ్యం పాలవుతున్నాం . ఇపుడు మరో బాంబు పేల్చడం దుర్మార్గం.

కోరుకొండ పైడిరాజు, తాడి గ్రామం

దుర్భరంగా జీవనం

ఫార్మా వ్యర్థాలు, కాలుష్యంతో దుర్భరంగా జీవనం సాగిస్తున్నాం. ఇక్కడి నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు వస్తున్నాయి. బయట నీటిని కొనుక్కుని తాగాల్సి వస్తోంది. నెలకు తాగునీటికే రూ.రెండువేలు ఖర్చవుతోంది.

దేవాదుల లక్ష్మి, తాడి గ్రామం

నేడు పరవాడలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిరుద్యోగ యువతకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ.హేమ సుందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సంస్థ విజయవాడ సిఐపిఇటి, సింహాద్రి ఎన్‌టిపిసి సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణను అందించనున్నారన్నారు. ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికత ఉండి, 10 వ తరగతి విద్యార్హత, 18నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల 30 మందికి విజయవాడ పోలిమెర్స్ టెక్నాలజీలో 6 నెలల నైపుణ్యాభివద్ధి శిక్షణనిచ్చి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, హెూసూర్, చెన్నై ప్రాంతాలలో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు సిఐపిఇటి జాయింట్ డైరెక్టర్, హెడ్ డాక్టర్ సిహెచ్ శేఖర్ తెలిపారన్నారు. శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3 వేలు స్టయిపెండ్ అందిస్తామన్నారు. వివరాలకు 9398535697 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టిడిపితోనే బిసిల సాధికారత

జయహో బిసిల సభలో ఐక్యత చాటుతున్న నేతలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బిసిల హక్కుల సాధన తెలుగుదేశం తోటే సాధ్యమని, ఐక్యంగా ఉండి సాధించుకుందామనిఅనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్దా నాగ జగదీశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలో పెదపూడి అగ్రహారం ఉప్పరగూడెం గ్రామంలో జయహో బిసి సమావేశం జరిగింది. బిసిలంతా సంఘటితంగా ఉండి హక్కులను సాధించుకుందామని నేతలు నిర్ణయించారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్. రాజు, నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి పార్లమెంట్ బిసి కోఆర్డినేటర్ గుర్రం నూకరాజు, జిల్లా వికలాంగుల కన్వీనర్ బత్తుల లక్ష్మి, రాష్ట్ర సగర సాధికార చైర్మన్ జంపెన శ్రీనివాసరావు, బిసిల సంఘంరాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరసెట్టి శ్రీనివాసరావు, అరకు పార్లమెంట్ బిసి కన్వీనర్ నక్కా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, డోంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, జనసేన డిఎస్ నాయుడు, దొండ సాయి, బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు

అపూర్వ సమ్మేళనం

కలుసుకున్న పూర్వ మిత్రులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి ఎంహెచ్. పాఠశాలలో 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా సత్యనారాయణమూర్తిస్వామి కొండ వద్ద ఆదివారం కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన స్నేహితులంతా కలుసుకుని, ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. వచ్చే ఏడాది పదో తరగతి బ్యాచ్ ఏర్పడి 40ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో బొజ్జన్న కొండ వద్ద పెద్దఎత్తున ఫంక్షన్ ఏర్పాటుచేసుకుందామని నిర్ణయించుకున్నారు.కార్యక్రమంలో ములుకూరి రామకష్ణ, అప్పికొండ మహేష్, చెరుకూరి సుబ్బారావు, బొట్టా చిన్ని యాదవ్, గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసిపి సీట్ల తారుమారు

భవిష్యత్తుకు గ్యారంటీలో గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటమి భయంతోనే సిఎం జగన్‌రెడ్డి ఇన్‌ఛార్జిల పేరుతో అసెంబ్లీ సీట్లను తారుమారు గారడీ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవిందసత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కొండపాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రానికి పట్టి వైసిపి పీడకు టిడిపి, జనసేన పొత్తే వ్యాక్సిన్ అన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి పాలనలోనే రాష్ట్రం పురోగమిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుళ్ళా వరలక్ష్మి, దుల్లా జగన్నాథం, ఎంపిటిసి మదుపాడ పద్మావతి, నర్సింగరావు, శెట్టి వెంకటరమణ, తలారి కాశీ నాయుడు, బాలాజీ, దాడి పెంటారావు, ఆదిబాబు, పావాడ కామరాజు, కరణం రమణ, జొమ్మల బాబురావు పాల్గొన్నారు.

28న ఓట్ ఫర్ ఒపిఎస్ బహిరంగసభ

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పాత పెన్షన్ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకి మాత్రమే రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలనే నినాదంతో ఈనెల 28న రాజమండ్రి ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల మైదానంలో జరగనున్న ఓట్ ఫర్ ఒపిఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నేతలు కోరారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు ఆఫీసు వద్ద దీనికి సంబంధించిన పోస్టర్‌ను యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు ప్రతిపక్ష నేతగా హామీనిచ్చిన సిఎం జగన్, ఇపుడు సిపిఎస్ రద్దు చేసి, ఎవరూ కోరుకోని జిపిఎస్ ప్రవేశపెట్టడం మోస పూరిత చర్య విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శులు నడిగట్ల శేషుకుమార్, పొలిమేర చంద్రరావు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, మారిశెట్టి వెంకటప్పారావు పాల్గొన్నారు.

సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలి

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరుకు వామపక్షాల లేఖ

ప్రజాశక్తి- అనకాపల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలని వామపక్షపార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ జిల్లా కన్వీనర్ పిఎస్ అజయ్ కుమార్ కలెక్టరుకు లేఖ రాశారు. 41 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున మంత్రులు, అధికారులు చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం సానుకూల వైఖరి లేకపోవడంతో విఫలమయ్యాయన్నారు. అంగన్వాడీలకు నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మె విరమించాలని ఒత్తిడిచేయడం భావ్యం కాదు. జిల్లాలో 3,518 మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లలో వెనుకబడిన బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే అధికంగా ఉన్నారని, వీరంతా ప్రభుత్వం ఇచ్చే వేతనంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పక్క తెలంగాణ, కర్నాటక చివరికి చిన్న రాష్ట్రం పాండిచ్చేరితో పోల్చుకున్నా రాష్ట్రంలో అంగన్వాడీలకు తక్కువ వేతనం ఇస్తున్నారని, వేతనం పెంపుపై ఇచ్చిన హామీ అమలు చేయాలని సమ్మె చేస్తే నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అనివార్యమై సమ్మెకు దిగి, 41 రోజులుగా పండుగలు, ఇంటి పనులు, పిల్లలను, వద్దులను వదిలి రోడ్డున పడ్డ అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడ దుర్మార్గమన్నారు. ఐదు రోజులుగా విజయవాడలో నిరవధిక దీక్షలు చేస్తున్న అంగన్వాడీల ఆరోగ్యాలు క్షీణిస్తున్నందున తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్వాడీల ద్వారా లబ్దిపొందుతున్న తల్లి,దండ్రులు, గర్భవతులు, ప్రజలు, చివరికి అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సైతం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మద్దతు తెలియజేస్తున్నా, వారి సమస్యలు పరిష్కారం కాకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంఘ నాయకులతో చర్చలు జరిపి న్యాయమైన కోర్కెలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకొని సమ్మె విరమింపజేయాలని కోరారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత

ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలో మేజర్ పంచాయతీ చౌడువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక తాము చదువుకున్న చౌడువాడ ఉన్నత పాఠశాలలో జరగ్గా, ఈ సందర్భంగా తమతో పాటు చదువుకున్న దుర్గి శ్రీనివాసరావు అనే తోటి పూర్వస్నేహితుడు ప్రమాదవశాత్తు మరణించడంతో వారి కుటుంబం దీనావస్థలో ఉండడం గమనించిన వారంతా శ్రీనివాసరావు కుటుంబానికి బాసటగా నిలిచారు. శ్రీనివాసరావు భార్య, ఇద్దరు ఆడపిల్లలకు రూ. 50వేల ఆర్థిక సహాయం అందించారు. తోటిస్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అందించిన సహకారానికి గ్రామస్తులు అభినందించారు .

వైసిపి పాలనలో పన్నుల బాదుడు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రజల ఆదాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగకపోయినా, పన్నుల భారం విపరీతంగా పెరిగిపోయిందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, సంపూర్ణ మద్యనిషేధం హామీని అటకెక్కించగా, ఆర్‌టిసి చార్జీలు, తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు, పెట్రోలు డీజిల్, నిత్యావసరాల ధరలు, చెత్తతోపాటు విలువ ఆధారిత ఇంటి పన్నులు, ప్రజలు నడ్డి విడిచారని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేకత రావడంతో 29మంది దళిత ఎమ్మెల్యేలను బలిచేసి, నియోజకవర్గాలకు మార్పుతో సామాజిక సాధికారిత అంటూ డబ్బా కొడుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో కోట్ని రామకృష్ణ బోడి వెంకటరావు కుప్పిలి జగన్ విల్లూరు రమణ బాబు పాల్గొన్నారు.

'పీలా' ప్రగల్బాలు మానుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యన్నారాయణ ఉత్తరకుమార ప్రగల్బాలు మాని వాస్తవ పరిస్థితులు మాట్లాడాలని వైసిపి అనకాపల్లి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు హితవు పలికారు. ఐదు నెలల ముందే అభ్యర్థులను ఎంపిక చేసే సత్తా ఉన్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. అనకాపల్లి అభ్యర్థి ఎవరన్నది నేటికీ తేల్చుకోలేని స్థితి చంద్రబాబుదని గ్రహించాలన్నారు. పీలా గోవిందకు అనకాపల్లి అసెంబ్లీ సీటుందో లేదో కూడా తెలుసుకోకుండానే అభ్యర్థినని, 50 వేల పై చిలుకు మెజార్టీ అంటూ డప్పు కొట్టుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయాల్లో ఎక్కువగా ఊహించుకోవటం మానేసి, ముందు సీటు సంపాదించుకునే ప్రయత్నం చేసుకోవాలని సూచించారు.

కార్మికుల కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పెరిగిన ధరలకు అనుగుణంగా అల్యూమినియం కార్మికుల మజూరీ కూలి రేట్లు పెంపుదలకు ప్యాక్టరీ యాజమాన్యాలు సహకరించాలని అల్యూమినియం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) పూర్వ ప్రధాన కార్యదర్శి బుద్ద భద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో యూనియన్ సీనియర్‌నేత ఎం. పేరాజును ఘనంగా సత్కరించారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, జిల్లా నాయకులు వై. ఎన్. భద్రం యూనియన్ కార్యదర్శి పెంటకోట.ప్రసాద్, కర్రి. దివాకర్, కాండ్రేగుల. శ్రీను, కె.గిరిబాబు,పెంట కోట శ్రీనివాస్, ఎమ్. కొండ బాబు ఈగల. అప్పారావు, చుక్కల. సత్యనారాయణ పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు : పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. చౌడువాడకు చెందిన కుమార లక్ష్మి(35) ఆదివారం సాయంత్రం పొలం పనికి వెళ్లి తిరిగి పశువుల పాక వద్దకు వస్తుండగా మార్గమధ్యలో పాము కాటుకు గురైంది. గమనించిన తోటి మహిళలు ఆమెను వెంటనే స్థానికప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడింది.

తారువలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామంలో రూ.3.76 కోట్ల వ్యయంతో నూతనంగా తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిర్మించిన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించారు. తారువతో పాటు తిమిరాం, వాకపల్లి, నీలంపేట, కొత్తూరు, చీడిపల్లి గ్రామాలకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా దీన్ని నిర్మించారు. దీంతోపాటు రూ.కోటి 20 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికి కుళాయిలు ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. దీనికి సంబంధించి 60 వేలు, పదివేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి సత్యం, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరరావు, జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు అనురాధ, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, యువ విభాగం అధ్యక్షులు కర్రి సూరినాయుడు వరదపు రెడ్డి సింహాచలం నాయుడు కె.వి రమణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్ మహేంద్ర నాథ్, ఎఇఇ శంకరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

: ఆర్థికసాయం అందజేస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి పెందుర్తి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి రోమాల చంద్రశేఖర్ రూ .90 వేలు విరాళం అందించారు. సబ్బవరంలోని తన నివాసంలో రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆలయ గర్భగుడి గ్రానైట్ ఏర్పాటుతో పాటు కలశస్థాపన నిర్మాణానికి ఈ విరాళం అందించినట్లు సర్పంచ్ తెలిపారు. విరాళదాత చంద్రశేఖర్‌కు ఆలయ నిర్మాణ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుంగ ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పిల్లల ముసలయ్య, నక్కెళ్ళ అచ్చిబాబు, ఇసరపు వెంకటరావు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో హెచ్‌టి విద్యుత్ స్టేషన్ ఏర్పాటు

ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మహేంద్రనాథ్

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని మామిడిపల్లిలో రూ. 10 కోట్లు వ్యయంతో 132/33 కెవి ఈహెచ్‌టి విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు ఉమ్మడి విశాఖ జిల్లా ఎపిఇపిడిసిఎల్ (ఆపరేషన్స్) ఎస్ఇ ఎల్ మహేంద్రనాథ్ తెలిపారు. ఆదివారం మండలంలోని తారువలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసమైన 4 ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. చింతలపూడిలో ఠీ వేంపేడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టారు స్కీము కింద 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని రూ. 3.50 కోట్ల వ్యయంతో నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. తారువలో రూ. 3.76 కోట్ల వ్యయంతో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించామని,దీనికి అవసరమైన 50 సెంట్లు భూమిని తారువ గ్రామానికి చెందిన గొర్రెపాటు తమ్మునాయుడు ఉచితంగా ఇచ్చారన్నారు. ఈ విద్యుత్ ఉపకేంద్రంతో దేవరాపల్లి, చీడికాడ మండలాలకు చెందిన 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే వెంటనే తమ శాఖకు చెందిన టోల్ ఫ్రీ నెంబర్ 1912కి ఫోను చేసి చెప్పాలన్నారు. కరెంటు బిల్లులు మొబైల్ ద్వారా చెల్లించగోరే వారు estran-power యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా డౌనులోడు చేసుకుని చెల్లించవచ్చన్నారు . ఈ యాప్ ద్వారా చెల్లించినప్పుడు తాము ఎంత కరెంటు వాడుతున్నామో తెలుసుకోవడంతో పాటు కట్టిన బిల్లును డౌనులోడు చేసుకోవచ్చన్నారు. చీడికాడ నుంచి చీడిపల్లి వరకు పోలిమర్ ఇన్సులేటర్లు వేయాలని, చీడికాడలో 33/11 కెవి బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలన్న వినతికి ఎస్ఇ సానుకూలంగా స్పందించారు. ఇఇలు రాజ్ కుమార్ వెంకటేశ్వరరావు, డిఇఇలు విడివి.రామకృష్ణ, గౌరీ ప్రసాదు, ఎఇఇ శంకరరావు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి వితరణ

సబ్బవరం: సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో పునర్నిర్మిస్తున్న మండల కేంద్రంలోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయానికి సబ్బవరం మేజర్ పంచాయితీకి చెందిన రోమాల దేముడు కుమారుడు పెందుర్తి నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ రోమాల చంద్రశేఖర్ రూ.1.499లక్షల ఆర్థికసాయాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, గెద్దం కృష్ణ, బర్ల రమణ, దంగేటి ప్రకాష్, దంగేటి నాని, ఉసిరిగల రమేష్, గొంప అశోక్ కుమార్, సింగంపల్లి కృష్ణ, కోరాడ సుధీర్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

27న ఎన్నికల శంఖారావ సభను

జయప్రదం చేయండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా ఈనెల 27న భీమిలిలో నిర్వహించనున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావసభను జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో చోడవరం మండల ప్రజాప్రతినిధులు, గృహసారథులు కన్వీనర్లు పార్టీ సర్పంచులు ఎంపిటిసిలు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువక సత్య రావు, మండల వైకాపా అధ్యక్షులు దొడ్డి వెంకటరావు, డిసిఎంఎస్ చైర్మన్ పల్ల నర్సింగరావు, స్థానిక ఎంపీపీ గాడి కాసు, పార్టీ సీనియర్ నాయకులు దన్నిన వెంకట్రావు, వేంపల్లి ఆనందీశ్వరరావు, బొడ్డేటి సూర్యనారాయణ, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ, దేవరపల్లి సత్య, ఒరుగంటి నెహ్రు, హిస్టరీ కమిటీ డైరెక్టర్ తంగుడుపల్లి జగ్గారావు బైన ఈశ్వరరావు, వేతలపు ప్రకాష్, శివాలయంకమిటీ చైర్మన్ జి సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : 27న శనివారం భీమిలిలో జరగనున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఎన్నికల శంఖారావసభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు రాజు పిలుపునిచ్చారు. ఆదివారం కొండకర్ల గ్రామంలో వైసిపి ఎలమంచిలి నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో చేపట్టాల్సిన వ్యూహాలపై సిఎం జగన్ వివరిస్తారని, భారీసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబిమాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, ఎలమంచిలి మున్సిపాలిటీ చైర్మన్ పిల్లా రమాకుమారి, అచ్యుతాపురం మునగపాక రాంబిల్లి ఎలమంచిలి మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సాహసాల సాహితి

-నీటిలో గంటల తరబడి అద్భుతంగా యోగా ఆసనాలు
-32 ప్రపంచ రికార్డులు కైవశం-పలువురు ప్రశంసలు

నీటిలో తేలియాడుతూ ఆసనం వేస్తున్న సాహితి

ప్రజాశక్తి - కొత్తకోట: యోగాసనాలంటే అంటే అందరు నేలపై చేస్తారు. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన కలగర్ల సాహితీ నీటిలో యోగా ఆసనాలు వేస్తూ జల యోగాలో ప్రత్యేక ప్రతిభను సాధించింది. నీటి మీద అవలీలగా వివిధ యోగాసనాలు పద్మాసనం, ధనురాసనం, మకరాసనం, పశ్చిమోత్తాసనం, వక్షాసనం, శలభాసనం, భుజంగాసనం, వీరభద్రాసనం, నటరాజాస నం, గోముఖాసనం, పర్వతాసనం, శవా సనం వేయడమే కాకుండా నీటిలో గంటల తరబడి వివిధ ఆసనాలలో నీటిపై తేలి యాడుతూ పలువురిని ఆశ్చర్యపరస్తోంది. ఇందుకుగాను బాలిక సాహితి కి 32 ప్రపంచ రికార్డులు దక్కాయి. యోగాసనాలు వేయడంతో శారీరక, మానసిక ఆరోగ్యం సొంతమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనాను జయించడానికి "మనం ప్రాణాయామ, యోగాసన సాధన చేయవలసి ఉంటుంది. స్విమ్మింగ్ కూడా ఆరోగ్యానికి, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆమె చెబుతోంది. ఈ విధంగా సాహితీ ఇటు స్విమ్మింగ్లోను, యోగాసనాలు సాధనలోను విశేషమైన ప్రతిభ కనపరుస్తుంది. సాహితీ మొదటి సారిగా ఏడు సంవత్సరాలు వయసులోనే అనకాపల్లిలో రోటరీ క్లబ్ నిర్వహించిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించింది. అప్పటి అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతులమీదుగా బంగారు పతకం, ప్రశంసలు అందుకుంది. తరువాత వివిధ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. అంతేకాక సాహితి సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరు చిన్నారుల ప్రాణాలను రక్షించి వివిధ సేవా సంస్థల నుంచి, అలాగే జిల్లా స్థాయిలో రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో "సాహస బాలిక"గా గుర్తింపు పొందింది.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సాహితి

ఏడవ ఏట నుంచే అవార్డుల పంట

తన సాహసాన్ని గుర్తించి ఈ ఏడాది మల్టీ ఫుల్ వరల్డ్ రికార్డు హెూల్డర్ గా గుర్తింపు పొందిన సాహితి గత సంవత్సరం భారత ప్రభుత్వం వారు సాహితి కి నేషనల్ బ్రేవరీ అవార్డు, జాతీయ సాహస బాలిక ఆవార్డు-రాష్ట్రపతి అవార్డు బహుకరించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ "ఆర్యవైశ్య సాహస పుత్రిక" ఆవార్డు, మదర్ తెరిసా ఆర్గనైజేషన్ వారు "ఆణిముత్యం" అవార్డు, సూర్య చంద్ర ఆర్గనైజేషన్ వారు సాహస బాలిక అవార్డు, సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియే షన్ వారు "ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారం", హెచ్ఇడి. ఎఫ్ ఎం "సాహస అతిథి" పురస్కారం, విభిన్న ప్రతిభావంతుల సంఘం "సాహస క్రీడాకారిణి" అవార్డు, సృజన ఆర్ట్ క్రియేషన్ మిలియన్ ఎక్సలెన్సీ అవార్డు అందుకుంది. ఇంతేకాకుండా సాహితీ మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ రోశయ్య చేతుల మీదుగా ఉగాది పురస్కారం, సంక్రాంతి పురస్కారాలు అందుకుంది. మేటి స్పీకర్ గంప నాగేశ్వర రావు చేతుల మీదుగా సాహితి వివిధ అవార్డు లు అందుకుంది. ముఖ్యంగా జల యోగాసనాలు వేయడంలో 32 ప్రపంచ రికార్డ్స్ సాధిం చింది. సాహితీ నీటిలో మన జాతీయ పతాకాలను పట్టుకుని రెండు చేతుల్లోని మరియు తన నోటితో కూడా జాతీయ పతాకం ని పట్టుకొని మన జాతీయ సమైక్యతను తెలుపుతూ స్విమ్మింగ్ పూల్ లో చేసిన విన్యాసాలు అద్భుతం, అలాగే మన జాతీయ పుష్పం అయిన లోటస్ లను రెండు చేతుల్లోనూ, తన నుదుటిపై పెట్టుకొని పద్మాసనం వేస్తూ నీటిలో తేలియాడుతూ అద్భుతమైన విన్యాసాన్ని ప్రదర్శించింది. దీనిని చూసిన పలువురు అభినందనలు తెలియజేశారు.

లోగోని ఆవిష్కరిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

బాలోత్సవాన్ని జయప్రదం చేయాలి

-జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: విద్యార్థుల్లో పెరుగుతున్న ప్రతిభా పాటవాలతో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారని, వాటిని ప్రదర్శించే వేదికలు కల్పించడమే ప్రధాన లక్ష్యం అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.త్రిమూర్తులు తెలిపారు. ఆదివారం శారద నగర్లోని విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి మీటింగ్ హాల్లో జరిగిన బాలోత్సవం కమిటీ ప్రథమ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవం కమిటీ నిర్ణయాలను ఆయన తెలియజేశారు. బాలోత్సవంలో ప్రజలందరినీ భాగస్వాములను చేసి పిల్లల పండగలా జరపాలని బాలోత్సవానికి అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బాలోత్సవం కమిటీకి గౌరవ అధ్యక్షులుగా దస్త్రాల రాఘవేంద్రరావు, అధ్యక్షులుగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, కార్యదర్శిగా కె.త్రిమూర్తులను నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల బాలబాలికలు వేదికగా ఉండాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. విద్యార్థులకు అకడమిక్లో 12 అంశాలపై కల్చరల్ లో ఎనిమిది అంశాలపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలోత్సవాలలో మండలంలోని 60 పాఠశాల నుండి 2000 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన వచ్చునని కమిటీ అభిప్రాయబడింది. ఈ సమావేశంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, విశ్రాంత తెలుగు లెక్చరర్ జెట్టి ఎల్లమంద, విశ్రాంత పోస్టల్ అధికారి రామారావు, సీనియర్ జర్నలిస్ట్ పి.వి.సత్యనారాయణరావు, విశ్రాంత ఎల్ఐసి అధికారి టి.వెంకటేశ్వరరావు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, ఉపాధ్యాయులు రాజగోపాల్, చిట్టయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలోత్సవం లోగోను ఆవిష్కరణ చేశారు.

హాస్యామృతం కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : హాస్య కామెడీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం పౌర గ్రంథాలయంలో హాస్యామృతం కామెడీ షో నిర్వహించారు. పలువురు కళాకారులు ప్రదర్శించిన నలుగురు పెళ్లాల ముద్దుల మొగుడు, మాట కోసం ముప్పుతిప్పలు, ఎయిర్పోర్టు కామెడీ, పెళ్లాం ఊరెళితే స్కిట్స్ ప్రేక్షకులను అలరించాయి. అనంతరం హాస్య కామెడీ క్లబ్ సెక్రటరీ ఈమంది ఈశ్వరరావు మాట్లాడుతూ, హాస్య ప్రియ కామెడీ క్లబ్ ద్వారా ప్రతి నెలలో ఒక ఆదివారం ప్రేక్షకులను అలరించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కామెడీ షో ద్వారా ప్రేక్షకులను నవ్విస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, ఎం.రమణ, సీత, మల్లిక, పావని పాల్గొన్నారు.

210 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మాడుగుల: జాలంపల్లి గ్రామంలో 210 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ఆదివారం సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి, భానోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ రామకొండారావు ఆధ్వర్యంలో జాలంపల్లిలో వైదయ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్స నిమిత్తం 56 మందిని ఎంపిక చేశారు. వీరందరినీ ఈనెల 22 వ తేదీన సోమవారం బస్సులో అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్యం, శస్త్రచికిత్స చేయడం జరుగుతుందని నిర్వాహకులు రామ కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మండల యాదవ సంఘం ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బాణం భీమలింగేశ్వరావు, గనుతూర్ కన్నయ్య పడాల్, నమ్మి బాలరాజు, మార్తి రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

శంకుస్థాపన చేస్తున్న వైసిపి నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం: రెండు లక్షల నిధులతో చేపట్టే రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేసి పనులను చేపట్టడం జరిగిందని సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో కవగుంట పంచాయతీ శివారు బుడ్డి బంద గ్రామంలో రెండు లక్షల నిధులతో గుళ్ల పద్మనాభం దొర ఇంటి వద్ద నుంచి రొబ్బా సుభద్రమ్మ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అప్పట్లో లేఅవుట్ ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణాలు జరగక పోవడంతో రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడేవారన్నారు. శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సిసి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రహదారి పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జీ.వరహాలదొర, శంకర్రావు, ఎస్.గంగరాజు, పి.రాము, కే.వరహాలు, వీరభద్ర రాజు పాల్గొన్నారు.

సిఎం సభకు భారీగా తరలి రావాలి

-నవరత్నాలతో పేదలకు పథకాలు -రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం: భీమిలి నియోజకవర్గంలో ఈనెల27న జరిగే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సభకు భారీ ఎత్తున తరలి రావాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రావికమతం మండలం నుంచి 1200 మందికి తక్కువ లేకుండా పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు. రానున్న 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. చోడవరం నియోజకవర్గం లో రూ.1982 కోట్ల నిధులు తీసుకువచ్చి అన్ని విధాలుగా అబివృద్ధి చేసామన్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అబివృద్ధి పథంలో నడిపించామని ఆయన తెలిపారు. ఇచ్చిన మాట తప్పకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని కొనియాడారు. పేదలకు పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి నాయుడు, జగ్గారావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం సిఐగా సన్యాసినాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల సిఐగా సన్యాసినాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

చదివిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

చిల్డ్రన్స్ క్లబ్‌లో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పిల్లలకు నీతి కథలు చెప్పి ఒక్కొక్కరిచేత చదివించి, అందులోని నీతిని వివరించారు. పిల్లలు తమకు ఇష్టమైన కళలు మ్యూజిక్, డాన్స్, డ్రాయింగ్, మేజిక్, క్రీడలు నేర్చుకోవాలని మనసుని ఉల్లాసంగా ఉంచుకోవాలని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకర్ పిల్లలకు సూచనలిచ్చారు. మనసును ప్రశాంతంగా ఉంచుకున్నపుడు ఎదుగుదల ఉంటుందని చెప్పారు.

షర్మిలతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి -చీడికాడ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా నూతనంగా నియమితులైన వైయస్ షర్మిలకి అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు చీడికాడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 24న విశాఖపట్నంలో నిర్వహించే కాంగ్రెస్ సభకు పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల విచ్చేయనున్నందున అనకాపల్లి జిల్లా నుంచి సుమారు 5 వేలు మందికి పైగా జన సమూహాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్ షర్మిల ఎంట్రీతో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవాన్ని పుంజుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

94 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ చిరంజీవి పడల్ ఆదివారం తన ఛాంబర్ లో విలేకరులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పెదబయలు మండలంలో 23 పంచాయతీలకు గాను 94 ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కార్యదర్శి సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలోని సచివాలయ కార్యదర్శి బొల్లాప్రగడ అనంత సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయమని ఉద్యోగులు, ఆయా గ్రామాల ప్రజలు కొనియాడారు. పలు మండలాల్లోని గ్రామాల్లో ఆయన అందించిన సేవలను ఆయా ప్రాంతవాసులు స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

గొలుగొండ మండలం అమ్మపేట గ్రామంలో 1962లో జన్మించిన బొల్లాప్రగడ అనంత సుబ్రహ్మణ్యం 1988లో రెవెన్యూ కార్యదర్శిగా విధుల్లో చేరారు. కోటపాడు, నర్సీపట్నం, గోల్కొండ, కోటవరట్ల మండలాల్లో పలు గ్రామాల్లో ఆయన విశిష్ట సేవలు అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేయడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. సహచర సిబ్బందితో మమేకమై కార్యాచరణ రూపొందించి ఆయా గ్రామాల్లో వివిధ సేవలు అందించారు. ఏ మండలంలో పని చేసినా సహచర కార్యదర్శులకు ఆదర్శంగా నిలుస్తూ విధుల్లో వారికి సహకరించారు. ప్రభుత్వ సేవల్లో కేంద్ర బిందువై నిలిచారు. ఆయన తల్లిని విశాఖపట్నం చికిత్స నిమిత్తం తీసుకు వెళ్తూ గుండెపోటుకు గురై ఈనెల 8న మరణించడంతో విషాధం నెలకొంది.ఆయన కుటుంబంలోనే కాకుండా సేవలందించిన గ్రామాల్లో మండలాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు భార్య సుబ్బలక్ష్మి, కుమార్తె సూర్య కళ, కుమారుడు సూర్య ప్రదీప్ సహా ముగ్గురు అన్నదమ్ములు నాగేశ్వర శర్మ, పార్వతీశ్వర శర్మ, మంగ భగవానులు ఉన్నారు. కుమార్తె సూర్యకళ అల్లుడు మురళీధర్ అమెరికాలో ఉంటున్నారు. కుమారుడు సూర్య ప్రదీప్ హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ అమ్మపేటలో సోమవారం అమృతమూర్తి అనంత సుబ్రహ్మణ్యం ఆశీర్వచన కార్యక్రమం జరుగుతుంది.

మహనీయుడు లెనిన్

-శత వర్ధంతి సభల్లో వక్తలు
-కార్మికరాజ్యం స్థాపనతోనే ప్రజలకు దోపిడీ నుంచి విముక్తి : ఎంవిఎస్.శర్మ, లోకనాథం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచంలో దోపిడీ రాజ్యాలను కూల్చి కార్మిక రాజ్యాలు స్థాపించిన నాడే ప్రజలకు దోపిడీ నుండి విముక్తి కలుగుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్.శర్మ అన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో లెనిన్ శత వర్ధంతి సభ పార్టీ సీనియర్ నాయకులు జివిఎస్.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభానికి ముందు లెనిన్ చిత్రపటానికి శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు పెతకంశెట్టి వెంకటరెడ్డి, జివిఎస్.రాజేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాన్ని లెనిన్ ఆచరణలో పెట్టి రష్యాలో దోపిడీ వ్యవస్థను కూల్చి కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించి నాయకత్వం వహించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి విముక్తి కలిగించే విధంగా కృషి చేసిన వ్యక్తి లెనిన్ అని తెలిపారు. కార్మిక రాజ్యం స్థాపించడం ఒక్క కార్మికులతోనే సాధ్యం కాదని, దానికి కార్మిక, కర్షక మైత్రి చాలా అవసరమని భావించి దానిని ఆచరణలో పెట్టిన గొప్ప నాయకుడు ఆయనని తెలిపారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు జరిపి ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగించారన్నారు. 1917లో రష్యాలో విప్లవం సాధించి సుదీర్ఘకాలం ప్రజాపరిపాలన సాగించారన్నారు. రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం వచ్చాక భారతదేశంలో భారీ పరిశ్రమలు పెట్టేందుకు యంత్రాలను ఇచ్చి తోడ్పాటు అందించిందన్నారు. నేడు భారతదేశంలో మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని అమ్మేయడం లేదా మూసివేసే పనిలో ఉందన్నారు. పెట్టుబడిదారులకు లాభాల కోసం పనిచేస్తున్న దోపిడీ ప్రభుత్వాలను కూల్చి కార్మిక రాజ్యం స్థాపన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ లెనిన్ సామ్రాజ్యవాద గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గొప్ప మహనీయుడన్నారు. భారతదేశానికి రష్యా చేసిన సహాయాన్ని గుర్తుచేశారు. ఈ ఏడాది పొడువునా లెనిన్ శత వర్ధంతి సభలు జరిపి పెట్టుబడిదారీ వ్యవస్థకు, సోషలిస్టు వ్యవస్థగల తేడాలను ప్రజలకు వివరించాలన్నారు.

ప్రజాశక్తి, విశాలాంధ్ర ఆధ్వర్యాన..

విశాలాంధ్ర, ప్రజాశక్తి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా శత వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కవితలను వినిపించారు. మొదటి కవితగా 'కర్తవ్యం' చదివారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్.శర్మ హాజరై మాట్లాడారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కార్మిక, కర్షక వ్యతిరేక ప్రభుత్వాలు ఉన్నాయని చెప్పారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో నిరంకుశ ప్రభుత్వం నడుస్తోందని, దీనిని ఎదుర్కోవాల్సి ఉందని అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు సిఎన్.క్షేత్రపాల్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, తదితరులు

మాట్లాడుతూ మార్క్సిజం దివిటీని చేతబట్టి ప్రపంచానికి దారి చూపిన మహానేత లెనిన్ అని కొనియాడారు. సమావేశంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

సిపిఐ కార్యాలయంలో....

సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జిఎస్‌కె.అచ్యుతరావు, సిఎన్.క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, ఎస్‌కె.రెహమాన్ పాల్గొన్నారు.

ఎస్‌యుసిఐ(సి) ఆధ్వర్యంలో...

జివిఎంసి గాంధీ విగ్రహం దగ్గర ఎస్‌యుసిఐ(సి) ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్చార్జి ఎస్.గోవిందరాజులు పాల్గొని లెనిన్ పోరాట వివరాలను తెలిపారు. కార్యక్రమంలో కె.అభిలాష్, బి.సంతోష్, రాంప్రభు, డి.విజ్ఞానంద్ పాల్గొన్నారు.

అనకాపల్లి : మానవాళి విముక్తి కోసం మార్క్సిజాన్ని ఉపయోగించి, ప్రపంచ పీడిత ప్రజల జీవితాల బాగు కోసం పోరాడిన మహనేత లెనిన్ అనిసిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కొనియాడారు. ఆదివారం సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి రామునాయుడు భవన్‌లో లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని లెనిన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో లోకనాథం మాట్లాడుతూ కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, దారిద్ర్యం లేని సోషలిస్టు వ్యవస్థ సాధనకు కృషి చేసి సాధించిన గొప్ప ఆచరణవాదన్నారు. 1917లో రష్యా లో సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేసి, ప్రపంచంలో అనేక దేశాల్లో విప్లవాలు జయప్రదం కావటానికి బాటలు వేసిన చిరస్మరణీయుడన్నారు. అమానుషమైన పెట్టుబడిదారీ దోపిడీకి విరుగుడు సోషలిజమేనని ఆచరణలో రుజువు చేశారన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ దశలో ప్రజల సంపద కార్పొరేట్ పాలవుతున్న నేటి తరుణంలో యువత బంగారు భవిష్యత్తుకు దారీ చూపే భారతదేశ అభ్యున్నతికి, ప్రపంచానికి లెనిన్ సిద్ధాంతం మార్గదర్శకం అవుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సిపిఎం అనకాపల్లి మండల నాయకులు బి. ఉమామహేశ్వరావు, పెంటకోట శ్రీనువాసరావు, కె.తేల్లయ్యబాబు, కె.ఈశ్వరావు, కె.సుజాత, పి.చలపతి, జి.సురేష్, నూకఅప్పారావు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యంలో...

మనిషిని మనిషి దోచుకునే దోపిడీ వ్యవస్థను కూల్చి ప్రపంచంలోనే సోషలిస్టు వ్యవస్థను సోవియట్ యూనియన్‌లో నెలకొల్పి, అందరూ సమానంగా బతికే స్వేచ్ఛను తీసుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి లెనిన్ చిరస్మరణీయుడని సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కొనియాడారు. అనకాపల్లి సిపిఐ కార్యాలయంలో వైఎన్. భద్రం అధ్యక్షతన లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, తాకాసి వెంకటేశ్వరరావు, బుద్ధ వీరభద్రరావు, పెంటకోట నూక ప్రసాద్, కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీ రాజు, ఎం అప్పలరాజు, ఎన్ సత్యనారాయణ, వియ్యపు రాజు, వి .పోతురాజు, పెంటకోట వాసు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రపంచంలోనే మొట్టమొదటి కార్మిక రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు లెనిన్ అని సిపిఎం మండల శాఖ కార్యదర్శి జి దేముడునాయుడు అన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఎన్ నారాయణరావు, ఆర్ రాంబాబు, సిహెచ్ రామకృష్ణ, సిహెచ్ శివాజీ, ఎం శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ధనరాజ్, గంగాధరరావు పాల్గొన్నారు.

కె. కోటపాడు: మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు గండి నాయన బాబు, తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా నాయనబాబు మాట్లాడుతూ లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎర్ర దేవుడు. వనం సూర్యనారాయణ. వనం అప్పలనాయుడు. ఈర్లే నాయుడు బాబు. పద్మ. అప్పన్న పాల్గొన్నారు.

ఉక్కునగరం : ప్రపంచ మానవాళి భవిష్యత్తుకు మార్గం చూపిన మహానేత లెనిన్ శత వర్ధంతి సభను ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం స్టీల్ జోన్ కమిటీ నాయకులు నమ్మి రమణ అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలు లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దోపిడీ లేని సమాజం నిర్మించుకోవడమే కార్మిక వర్గ లక్ష్యమన్నారు. దీనికి కార్మిక వర్గమే నాయకత్వం వహించి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి, సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో నివాళి అర్పిస్తున్న స్టీల్ డివిజన్ నాయకులు